# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 170 బుధవారం 25, ఫిబ్రవరి 2026 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


# ఆపరేషన్ ఆక్టోపస్...



'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో దేశవ్యాప్త సైబర్ ముఠా అరెస్ట్

16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు.. 104 మంది అరెస్ట్

నిందితులకు సహకరించిన బంధన్ బ్యాంక్ అధికారి కూడా అరెస్ట్

దేశవ్యాప్తంగా 1,055 కేసుల్లో ₹127 కోట్ల మోసాలు చేసినట్లు గుర్తింపు

₹36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు స్వాధీనం

హైదరాబాద్, (ప్రజాస్వరం):

హైదరాబాద్ పోలీసులు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో, దేశంలోని 16 రాష్ట్రాల్లో విస్తరించిన అతిపెద్ద సైబర్ నేరాల ముఠా గుట్టురట్టు చేశారు. పెట్టుబడులు, ట్రేడింగ్, 'డిజిటల్ అరెస్ట్' వంటి మోసాలతో అమాయక ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న ఈ నెట్‌వర్క్‌కు చెందిన 104 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా

..మిగతా 2లో

# ఆ నలుగురు.. సరెండర్

దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహా రెడ్డి లొంగిబాటు

మిగిలిన వారు కూడా జన జీవనంలోకి రావాలి

మావోయిస్ట్ పార్టీలో ఇంకా ఉన్నది 11 మందే

దేవ్ జీ, రాజిరెడ్డికి రూ.25 లక్షలు

చొక్కారావు, నర్సింహా రెడ్డిలకు రూ.20 లక్షలు

లొంగిపోయిన అందరికీ తక్షణ సాయం

పొలిట్ బ్యూరో, కేంద్ర, రాష్ట్ర కమిటీలు నిర్వీర్యం

వివరాలు వెల్లడించిన డీజీపీ శివధర్ రెడ్డి



హైదరాబాద్, (ప్రజాస్వరం):

మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. నలుగురు అగ్ర నేతలు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, సెంట్రల్ కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహా రెడ్డి ఉన్నారు. డీజీపీ శివధర్ రెడ్డి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్, ఎస్ఐబీ ఐజీ సుమతితో

..మిగతా 2లో

# ఆరు నెలల్లో రాజీవ్ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

క్షేత్రస్థాయిలో ప్రాజెక్ట్ పరిశీలన

పనుల పురోగతిపై మంత్రి ఆరా

అధికారులకు కీలక సూచనలు

రూ.394 కోట్ల అంచనా వ్యయంతో పనులు

ప్రాజెక్ట్‌తో 14 వేల ఎకరాలకు సాగునీరు

హైదరాబాద్, (ప్రజాస్వరం):

నల్గొండ జిల్లా చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. రూ.394 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనుల పురోగతి, నాణ్యత, గడువు వంటి అంశాలపై అధికారులను ప్రత్యక్షంగా ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.

ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించిన మంత్రి, నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, వేగం పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. పనులు గడువులోపు పూర్తి కావాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి, దాదాపు 14 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

..మిగతా 2లో



# సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ...

'సేవా తీర్థ్' నూతన ప్రాంగణంలో ప్రధాని మోదీ అధ్యక్షతన తొలి కేబినెట్ సమావేశం

దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాకు ఆమోదం

కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చేందుకు గ్రీన్ సిగ్నల్

భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు 'సేవా సంకల్ప్'

రూ.12,236 కోట్లతో రైల్వే, మెట్రో సహా పలు మౌలిక ప్రాజెక్టులకు ఆమోదముద్ర

న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. నూతనంగా ప్రారంభమైన 'సేవా తీర్థ్' సముదాయంలో జరిగిన ఈ తొలి సమావేశంలో, దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించడం, కేరళ పేరును 'కేరళం'గా మార్చడం సహా అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. దీంతో పాటు, రాబోయే రోజుల్లో భారత్‌ను ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో

..మిగతా 3లో

# మేం తట్టి లేపితేనే రివ్యూలా?



రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు విమర్శలు

వరంగల్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో పర్యటన

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల పరిశీలన

పనుల్లో జాప్యంపై తీవ్ర అసంతృప్తి

బీఆర్ఎస్ హయాంలో దేవాదుల పనులు 90 శాతం పూర్తయ్యాయన్న హరీశ్

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రేవంత్ ఫ్యూచర్ సిటీ కలలు కంటున్నారని వ్యాఖ్య

ప్రభుత్వంపై రాజీ లేని పోరాటం చేస్తామని హెచ్చరిక

హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరోసారి ముదిరింది. వరంగల్ పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల జాప్యంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని ఇతర బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించిన అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. "మేము క్షేత్రస్థాయికి వచ్చి ప్రాజెక్టులను పరిశీలిస్తేనే ముఖ్యమంత్రి స్పందిస్తున్నారు. మేము విజిట్ చేసిన వెంటనే రివ్యూలు చేస్తున్నారు" అంటూ ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం ముందుగానే

..మిగతా 3లో

## జర్నలిస్టులకు ఒక్క రూపాయి ఇవ్వలేదు

జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపణ

రెండు బడ్జెట్లలో జర్నలిస్టులకు నిధులు కేటాయించలేదని విమర్శ

అక్రిడిటేషన్లు, హెల్త్ స్కీమ్ వెంటనే అమలు చేయాలని డిమాండ్

03

## పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణ

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'కు రెడీ

ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం

గ్రామాల వరకు అభివృద్ధి బాటలు

"గ్రేత్ ఎక్స్ 2026" సదస్సులో మంత్రి వ్యాఖ్యలు



02

## ఫలించిన సుదీర్ఘ వ్యూహం

మావోయిస్టుల లొంగుబాట్లలో తెలంగాణ టాప్

సీఎం రేవంత్ పిలుపునకు భారీ రెస్పాన్స్

గడిచిన రెండేళ్లలో 600 మంది సరెండర్

హైదరాబాద్, (ప్రజాస్వరం):

పోలీసింగ్‌లో దేశంలోనే అగ్ర స్థానంలో నిలిచిన తెలంగాణ పోలీసులు మావోయిస్టుల విషయంలోనూ నెంబర్ వన్ ఫలితాలను సాధించారు. సంయమనం, సహనంతో రెండేళ్లపాటు సుదీర్ఘ వ్యూహాన్ని అమలు చేసి వందల సంఖ్యలో మావోయిస్టులను జనజీవన స్రవంతిలో కలిపారు. ఇప్పటికీ అవకాశం ఉంది, అజ్ఞాతం వీడి

..మిగతా 2లో





## ఆ వెయ్యి కోట్లు ఎక్కడ్నించి తెచ్చావు?

ఆదిలాబాద్ జైలులో బాల్క సుమన్ ను పరామర్శించిన కేటీఆర్

గాంధీ కుటుంబానికి వేల కోట్లు పంపుతున్నారని రేవంత్ సర్కార్‌పై ఆరోపణ

ఆ వెయ్యి కోట్లు నీ అయ్యా సొమ్మా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించిన వైనం

రైతు బంధు, రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శ

పాలనను వదిలేసి దోపిడీకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ధ్వజం

సీఎం అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని నిలదీత

హైదరాబాద్, (ప్రజాస్వరం):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పాలనను పూర్తిగా గాలికొదిలేసి, దోపిడీయే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కార్ పనిచేస్తోందని, తెలంగాణ ప్రజల సొమ్మును ఢిల్లీలోని గాంధీ కుటుంబానికి తరలిస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఆదిలాబాద్ జైలులో

..మిగతా 3లో

## కేరళ ఇకపై కేరళం..

కేరళ పేరును 'కేరళం'గా మార్చేందుకు కేంద్రం ఆమోదం

కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్

మలయాళ ఉచ్చారణకు అనుగుణంగా పేరు మార్పు ప్రతిపాదన

రాజ్యాంగ సవరణ ద్వారా అధికారికంగా మారనున్న పేరు



03

## రైతు ప్రయోజనాలు తాకట్టు పెట్టారు

కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు

భోపాల్ 'కిసాన్ మహా చౌపాల్' సభ

అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఆగ్రహం

పార్లమెంట్‌లో చర్చ జరగలేదని వెల్లడి

కేబినెట్‌నూ సంప్రదించలేదన్న రాహుల్

మోడీకి స్వప్రయోజనాలే ముఖ్యమని వ్యాఖ్య



న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):

కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి ఘాటు విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర కేబినెట్‌ను సంప్రదించకుండా అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఖరారు చేశారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన

..మిగతా 3లో


www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM

# ఫలించిన సుదీర్ఘ వ్యూహం

**మొదటిపేజీ తరువాయి**

జనంలోకి రండి, ప్రభుత్వం కల్పించిన పునరావాస పథకాల ప్రయోజనాలను పొందండి అంటూ మిగిలిన కొద్దిమందికి పిలుపునిస్తున్నారు. అన్ని రకాలుగా అండగా ఉంటామని చెబుతున్నారు.

**2019 నుంచి శ్రీకారం**

మావోయిస్ట్ పార్టీ ఉనికి లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం 2019 నుంచే చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఆ పార్టీ ప్రభావం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లోని అడవుల్లో బేస్ క్యాంపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఈ ప్రణాళిక అమలును ప్రారంభించింది. 2024 జనవరి 1న ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించిన కేంద్రం, 2026 మార్చి 31వ తేదీలోపు మావోయిస్ట్ పార్టీని పూర్తిగా అంతం చేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా వేలాది సంఖ్యలో భద్రతా బలగాలను రంగంలోకి దింపింది. వారి చేతికి అత్యంత అధునాతన ఆయుధాలతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందచేసింది. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో ఎన్ కౌంటర్లు జరిగాయి. పెద్ద సంఖ్యలో మావోయిస్ట్ పార్టీ నేతలతోపాటు క్యాడర్ నేలకొరిగింది.

**తెలంగాణలో భిన్నమైన వ్యూహం**

మిగితా రాష్ట్రాల్లో మావోయిస్టులపై దమన నీతిని ప్రయోగించగా తెలంగాణ పోలీసులు ఇక్కడ దానికి పూర్తి భిన్నమైన వ్యూహాన్ని అమలు చేశారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం నుంచి ఎంత ఒత్తిడి వచ్చినా ఎక్కడా తలొగ్గలేదు. బుల్లెట్‌కు బుల్లెట్టే సమాధానం కాదనే విధంగా ముందుకు సాగారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వేర్వేరు సందర్భాల్లో డీజీపీ శివధర్ రెడ్డి కూడా పోరు వద్దు ఊరు ముద్దు అంటూ ఏళ్ల తరబడిగా అజ్ఞాతంలో ఉన్న వారిని ప్రజా క్షేత్రంలోకి ఆహ్వానించారు. మావోయిస్టుల కట్టడి కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ)లో సుదీర్ఘకాలం పని చేసిన అనుభవం ఉన్న ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి, ప్రస్తుతం ఆ విభాగంలో ఐజీగా విధులు నిర్వర్తిస్తున్న సుమతి దీని కోసం దీర్ఘకాల వ్యూహాన్ని అమలు చేశారు. ఆపరేషన్ కగార్ జోరుగా అమలవుతున్న వేళ తమదైన శైలిలో వ్యవహరించారు. లొంగిపోతే అన్ని రకాలుగా అండగా ఉంటాం, ప్రభుత్వం కల్పించిన పునరావాస పథకాల ప్రయోజనాలు అందేలా చూస్తామనే నమ్మకాన్ని మావోయిస్టుల్లో కల్పించారు. లొంగిపోయిన వారికి తక్షణ సహాయం అందచేయడంతో పాటు వారి పేరిట ఉన్న రివార్డుల మొత్తాన్ని వారికే అందించారు. జీవితంలో స్థిరపడడానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందజేశారు. ఓవైపు కేంద్రం నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి వచ్చినా ఎక్కడా సంయమనం కోల్పోలేదు. ఈ క్రమంలో గడిచిన రెండేళ్లలో 600 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే సరెండర్ అయిన వారిలో 90 శాతం మందికి పైగా మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు ఉన్నారు. మావోయిస్టుల్లో రాష్ట్ర పోలీసులు ఎంతగా నమ్మకం కల్పించారో దీనిని బట్టే స్పష్టమవుతుందని అధికారులు అంటున్నారు.

**హింసకు ప్రతి హింస జవాబు కాదు**

హింసకు ప్రతి హింస సమాధానం కాదన్నది దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మా గాంధీ చెప్పిన మాట. సరిగ్గా దీనిని ఆచరణలో చూపించారు మన రాష్ట్ర పోలీసులు. తాజాగా దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహా రెడ్డి, బడే చొక్కారావు సరెండర్‌తో రాష్ట్రంలో మావోయిస్ట్ పార్టీ ఉనికి నామమాత్రమైంది. ఉమ్మడి రాష్ట్రంలో పీపుల్స్ వార్ పేర ప్రారంభమైన ఉద్యమానికి సాఫ్ట్ ఆపరేషన్ ద్వారా తెలంగాణ పోలీసులు తమదైన శైలిలో ముగింపు ఇవ్వడంపై కేంద్రం నుంచి కూడా ప్రశంసలు అందినట్టుగా తెలిసింది.

# పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణ

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**



తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా నిలపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆర్థిక విధానాలకు శ్రీకారం చుడుతోంది. త్వరలోనే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'ను ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. పెట్టుబడిదారులకు మరింత సులభతరం, పారదర్శకత కల్పించే విధంగా ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు.మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఫ్యాప్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన "గ్రోత్ ఎక్స్ 2026" సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశ్రామికాభివృద్ధి యాదృచ్ఛికంగా సాధ్యమయ్యేది కాదని అన్నారు. దీర్ఘకాల ప్రణాళికతో ముందుకు సాగితేనే రాష్ట్రానికి స్థిరమైన వృద్ధి సాధ్యమని చెప్పారు.

తెలంగాణ ప్రస్తుతం సుమారు 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉందని, 2034 నాటికి దానిని ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ దిశగా "తెలంగాణ విజన్ 2047" రూపొందించామని వివరించారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం "క్యూర్ - ప్యూర్ - రేర్" అనే త్రిముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆరోగ్యం, పరిశుభ్రత, వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ నగరం నుంచి గ్రామం వరకు అభివృద్ధి చేర్చాలన్నదే ప్రభుత్వ అజెండా అని అన్నారు.

పరిశ్రమల స్థాపనలో పెట్టుబడిదారులు ఎదుర్కొనే అడ్డంకులను తొలగించడమే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0 లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే విధంగా పారదర్శక విధానాలు తీసుకురావాలని భావిస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాలతో చర్చించి, వారి సూచనలు తీసుకుని కొత్త విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు. సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఏఐ, ఇండస్ట్రీ 5.0 వంటి టెక్నాలజీలు పని సంస్కృతిని పూర్తిగా మార్చేశాయని మంత్రి పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో ఒక్కో కంపెనీ కంటే సమగ్ర 'ఎకోసిస్టమ్'కే ప్రాధాన్యత పెరుగుతుందని అన్నారు. అందుకే భవిష్యత్తును ఎదురుచూడకుండా, దానిని నిర్మించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు కేవలం అనుమతులు ఇచ్చే యంత్రాంగంగా కాకుండా, భాగస్వామిగా ఉండాలని భావిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. పెట్టుబడిదారులు ప్రభుత్వంతో కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్‌లు, సాంకేతిక సంస్థలు కలిసి పనిచేస్తే తెలంగాణ మరింత వేగంగా అభివృద్ధి సాధిస్తుందని అన్నారు.ఫ్యాప్సీ నిర్వహించిన ఈ సదస్సులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రముఖ వైద్యులు డా. నాగేశ్వర్ రెడ్డి, ఫ్యాప్సీ ప్రెసిడెంట్ ఆర్. రవి కుమార్, స్కైరూట్ ఏరో స్పేస్ ప్రతినిధి పవన్, గ్రోత్ ఎక్స్ 2026 కన్వీనర్ పంకజ్ దివాన్ తదితరులు పాల్గొన్నారు. వారు కూడా రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల వాతావరణంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

తెలంగాణ ఇప్పటికే ఐటీ, ఫార్మా, బయోటెక్, ఏరోస్పేస్ రంగాల్లో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించిందని మంత్రి తెలిపారు. కొత్త విధానాల ద్వారా మరిన్ని రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. తెలంగాణను దీర్ఘకాలిక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0' అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఆ నలుగురు.. సరెండర్




**మొదటిపేజీ తరువాయి**

కలిసి వివరాలు వెల్లడించారు.

**లొంగిపోయిన వారికి తక్షణ సాయం**

అడవులను వదిలేసి జనజీవన స్రవంతిలో కలిసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపునకు మావోయిస్టుల నుంచి సానుకూల స్పందన వచ్చినట్టుగా డీజీపీ చెప్పారు. వరుసగా జరుగుతున్న లొంగుబాట్లు దీనికి నిదర్శనమన్నారు. అనారోగ్య సమస్యలు, ఆపరేషన్ కగార్ నేపథ్యంలో అడవుల్లో ఉండలేని పరిస్థితి కూడా మావోయిస్టులను లొంగు'బాట' పట్టిస్తున్నాయని తెలిపారు. లొంగిపోయిన వారికి తక్షణ సహాయం అందచేస్తున్నట్టు చెప్పారు. దేవ్ జీ, మల్లా రాజిరెడ్డిలపై 25 లక్షల చొప్పున రివార్డ్ ఉన్నట్టు చెప్పిన డీజీపీ, ఆ మొత్తాన్ని వారికే అందచేస్తామన్నారు. బడే చొక్కారావు, నూనె నర్సింహా రెడ్డిలపై 20 లక్షల చొప్పున రివార్డులు ఉన్నట్టు తెలిపారు.

**మిగిలిన 11 మంది కూడా రావాలి**


లొంగిపోయిన మావోయిస్టుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస పథకాల ప్రయోజనాలను వారికి కల్పిస్తామని శివధర్ రెడ్డి చెప్పారు. వారు జనజీవన స్రవంతిలో కలిసిపోయి గౌరవంగా జీవించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రస్తుతం మావోయిస్ట్ పార్టీ చరమాంకంలో ఉన్నట్టుగా తెలిపారు. ప్రస్తుతం తెలంగాణకు చెందిన వారు కేవలం 11 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. వీరిలో సెంట్రల్ కమిటీలో ఇద్దరు, స్టేట్ కమిటీలో ముగ్గురు, డివిజన్ కమిటీలో ఇద్దరు, ఏసీఎంలు ఉన్నట్టు తెలిపారు. వారందరూ జనజీవన స్రవంతిలో కలవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**మావోయిజానికి అంతం లేదు**

మల్లా రాజిరెడ్డి మాట్లాడుతూ, మావోయిజానికి అంతం లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇది అభివృద్ధి చెందుతూనే ఉంటుందని చెప్పారు. సాయుధ పోరాటం ముగిసిందా లేదా అనే దానిపై ఎవరి అభిప్రాయాలు వారివి అని చెప్పారు. లొంగిపోవడానికి ముందు తాము దీని గురించి మాట్లాడుకోలేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారుల పిలుపు మేరకు లొంగిపోవాలనే నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. అయితే, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తమ సిద్ధాంతాలకు అనుగుణంగా ఈ పోరాటాలు ఉంటాయని చెప్పారు. ప్రభుత్వంతో చర్చించిన తరువాత మిగిలిన మావోయిస్టులకు సందేశం ఇస్తామన్నారు.

**రాజకీయాల్లోకి వస్తా..**

లొంగిపోయిన దేవ్ జీ మాట్లాడుతూ, భవిష్యత్తులో తాను రాజకీయాల్లోకి వస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి చట్టబద్ధమైన పోరాటాలు చేస్తానన్నారు. అనారోగ్య కారణాల వల్ల లొంగిపోయినట్టుగా చెప్పారు. వ్యక్తిగత జీవితం కోసం తాను బయటకు రాలేదన్నారు. మల్లోజుల వల్లనే పార్టీలో సంక్షోభం తలెత్తిందా అనే ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పలేదు. పార్టీ అంతర్గత విషయాలపై ఇప్పుడు మాట్లాడడం సరైంది కాదని స్పందించారు. ప్రస్తుతం అసలేం జరిగిందనే దానిపై సమగ్రంగా చెప్పలేని పరిస్థితి ఉన్నదన్నారు. ఏ ఒక్కరి గురించి మాట్లాడినా అనవసర చర్చలకు దారితీస్తుందని వ్యాఖ్యానించారు. అనవసర అపార్థాలకు కారణం కాకూడదనే సంక్షిప్తంగా మాట్లాడుతున్నట్టు తెలిపారు. సరైన సమయంలో సరైన వేదిక నుంచి అన్ని విషయాలు చెబుతానని దేవ్ జీ అన్నారు.



**ఎల్ఎల్‌బీ చదువుతూ..**


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వల్లూరు గ్రామానికి చెందిన నూనె నర్సింహా రెడ్డి నరసరావుపేట డిగ్రీ కాలేజీ నుంచి బీఎస్సీ (బీజెడ్‌సీ) పూర్తి చేశారు. ఆ తరువాత నాగార్జున వర్సిటీలో ఎల్ఎల్‌బీలో చేరారు. ఆ సమయంలో రిటైర్డ్ లెక్చరర్ జంధ్యాల రవీంద్రనాథ్ నాయకత్వంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చేరారు. అనంతరం మావోయిస్ట్ పార్టీలో చేరి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారు.

**రాడికల్ స్టూడెంట్ యూనియన్‌తో మొదలు**



జగిత్యాల జిల్లా కోరుట్ల గ్రామానికి చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీది వ్యవసాయ కుటుంబం. 10వ తరగతి పాసైన తరువాత ఇంటర్ చదవడానికి కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరారు. ఆ సమయంలోనే దేవ్ జీకి రాడికల్ స్టూడెంట్ యూనియన్‌తో పరిచయం ఏర్పడింది. విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితుడై అందులో చేరి కోరుట్ల టౌన్ అధ్యక్షుడిగా, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. 1978లో పీపుల్స్ వార్ (ప్రస్తుత మావోయిస్ట్ పార్టీ) నిర్వహించిన జగిత్యాల జైత్రయాత్రలో పాల్గొన్న దేవ్ జీ 1982లో ఆ పార్టీలో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్నారు.

**రైతు కుటుంబం నుంచి వచ్చి..**



పెద్దపల్లి జిల్లా మంథని మండలం శాస్త్రుల పల్లెకు చెందిన మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్‌ది కూడా వ్యవసాయ కుటుంబమే. 1975లో రత్తమ్మ అలియాస్ నిర్మలను వివాహం చేసుకోగా స్నేహలత అనే కుమార్తె పుట్టింది. బిడ్డకు జన్మనిచ్చిన తరువాత 1982లో పీపుల్స్ వార్ పార్టీలో చేరారు. ఆ తరువాత 2001లో పార్టీలో సభ్యురాలిగా ఉన్న మజ్జిబిచ్చి అలియాస్ సుగుణను రెండో పెళ్లి చేసుకున్నారు. రాజిరెడ్డి కూడా రాడికల్ స్టూడెంట్ యూనియన్ ప్రభావంతోనే విప్లవ బాట పట్టారు. కోరుట్ల, జగిత్యాలలో నమోదైన కేసుల్లో పోలీసులు 1976లో అరెస్ట్ చేయగా ఆ మరుసటి సంవత్సరం విడుదలయ్యారు. ఆ తరువాత రెండేళ్లపాటు గోదావరి ఖని బొగ్గు గనుల ప్రాంతంలో ఆర్గనైజర్‌గా పని చేశారు. 1988లో మరోసారి అరెస్టయిన రాజిరెడ్డి ఆదిలాబాద్ జైలు నుంచి పారిపోయి సాయుధ దళంలో చేరడం ద్వారా అజ్ఞాత జీవితాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం మావోయిస్ట్ పార్టీ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ఇన్ ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.

**బంధువు ప్రోద్బలంతో..**



ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ 10వ తరగతి చదువుతున్న సమయంలోనే రాడికల్ స్టూడెంట్ యూనియన్ పట్ల ఆకర్షితులయ్యారు. ఈయన సమీప బంధువు బడే నాగేశ్వరరావు అలియాస్ ప్రభాకర్ అప్పటికే మావోయిస్ట్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ఆయన ప్రోద్బలంతో పార్టీలో చేరారు. మొదట దళ సభ్యుడిగా చేరిన బడే చొక్కారావు అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఉన్నారు.

# ఆరు నెలల్లో రాజీవ్ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి

**మొదటిపేజీ తరువాయి**



అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన రోజుల్లో ఈ ప్రాంతానికి చేరుకోవడమే కష్టంగా ఉండేదని గుర్తుచేశారు. రహదారులు సరిగా లేకపోవడం, సాగునీటి సదుపాయాలు లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. గతంలో అమలు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల వల్ల దొండపాడు పరిసర ప్రాంతాలకు సాగునీరు అందించగలిగామని వివరించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. పంటల సాగుకు నిరంతర నీటి సరఫరా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైతులకు స్థిరమైన నీటి వనరులు అందుబాటులోకి వస్తాయని, పంటల దిగుబడులు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. పనులు వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక మద్దతు ప్రభుత్వం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల విజయవంతానికి ప్రజల సహకారం కూడా అవసరమని స్పష్టం చేశారు.

రాజకీయ అంశాలపై కూడా మంత్రి వ్యాఖ్యానించారు. ఓట్ల సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఆశించిన స్థాయిలో మద్దతు లభించడం లేదని అన్నారు. అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే ప్రజలు అభివృద్ధి దిశగా పనిచేసే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా శివగంగా లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద కాపర్ వైర్ చోరీ జరిగిన విషయం కొంతమంది రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి తీవ్రంగా స్పందించారు. అక్కడే ఉన్న డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డికి వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. నిందితులను త్వరగా పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

లిఫ్ట్ వద్ద భద్రతా లోపాలపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన గార్డును వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థల సంరక్షణలో రైతులు కూడా భాగస్వాములవ్వాలని మంత్రి కోరారు. పరస్పర సమన్వయంతో ఒక కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టు రక్షణ, నిర్వహణపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం, రైతులు కలసి పనిచేస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు ఫలిస్తాయని అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సీఈ రమేష్ బాబు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ కిషోర్, ఏఈ శ్రీనివాస్, తహసీల్దార్ సూరయ్య, ఎస్సై సందీప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరాల కొండారెడ్డి, చిలకల శ్రీనివాస్ రెడ్డి, నందిరెడ్డి ఇంద్రారెడ్డి, దేవి రెడ్డి లక్ష్మారెడ్డి, సర్పంచ్ చెన్నకేశి వెంకయ్య, కొండపల్లి సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తి అయితే చింతలపాలెం మండలంతో పాటు పరిసర గ్రామాల రైతులకు పెద్ద ఊరటనిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన గడువులోపు పనులు పూర్తవుతాయా లేదా అన్నది ఇప్పుడు కీలకంగా మారింది. రైతులు మాత్రం ప్రాజెక్టు త్వరగా పూర్తి కావాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆపరేషన్ ఆక్టోపస్...

**మొదటిపేజీ తరువాయి**



ద్వారా వెల్లడించారు.

ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయి. అమాయకులను నమ్మించి, భయపెట్టి, వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న ఘటనలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో డీసీపీ (సైబర్‌క్రైమ్స్) వి. అరవింద్ బాబు నేతృత్వంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు (CCPS) ఈ మోసాలపై లోతైన దర్యాప్తు చేపట్టారు. నేరగాళ్లు బాధితుల నుంచి దోచుకున్న సొమ్మును మళ్లించడానికి ఉపయోగిస్తున్న 151 బ్యాంకు ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ఆధారంగా దేశవ్యాప్తంగా విస్తరించిన ముఠా వివరాలను ఛేదించారు.

ఈ భారీ నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకిలించేందుకు 32 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల నేతృత్వంలోని ఈ బృందాలు 10 రోజుల పాటు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో మొత్తం 104 మందిని అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టయిన వారిలో 86 మంది 'మ్యూల్ అకౌంట్ హోల్డర్లు' ఉన్నారు. వీరు తమ బ్యాంకు ఖాతాలను కమీషన్ కోసం సైబర్ నేరగాళ్లకు అప్పగించారు. మరో 17 మంది ఈ ఖాతాలను సేకరించి ముఠా సూత్రధారులకు అందించే ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ ముఠాతో కుమ్మక్కై నకిలీ ఖాతాలు తెరిచేందుకు సహకరించిన బంధన్ బ్యాంకుకు చెందిన ఓ రిలేషన్‌షిప్ మేనేజర్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

అరెస్టయిన ఈ నిందితులకు దేశవ్యాప్తంగా నమోదైన 1,055 సైబర్ ఫ్రాడ్ కేసులతో సంబంధం ఉన్నట్లు తేలిందని, ఈ మోసాల మొత్తం విలువ సుమారు రూ.127 కోట్లు ఉంటుందని కమిషనర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు, 141 సిమ్ కార్డులు, 234 డెబిట్/క్రెడిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు, 152 బ్యాంకు పాస్‌బుక్‌లు, 56 కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు.

జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ బ్రాంచ్) ఎస్.ఎం. విజయ్ కుమార్, డీసీపీ అరవింద్ బాబు పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ విజయవంతమైందని కమిషనర్ ప్రశంసించారు. సైబర్ నేరాల పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తున్నామని, ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ముఠాలోని ప్రధాన సూత్రధారులను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశామని, సైబర్ నేరగాళ్లకు సహకరించే బ్యాంకు అధికారులు, మ్యూల్ ఖాతాదారులతో సహా ఎవరినీ వదిలిపెట్టేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

# మేం తట్టి లేపితేనే రివ్యూలా?..

మొదటిపేజీ తరువాయి

స్పందించాల్సిందని సూచించారు.దేవాదుల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలోనే 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పూర్తి చేయడంలో ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఒక్క ఎకరా భూమిని కూడా సేకరించలేదని, కొత్తగా ఒక్క ఎకరాకు సాగునీరు అందించలేదని విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు తమకు ప్రాధాన్యత అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు నెమ్మదిగా సాగుతున్నాయని అన్నారు.
పేదల ఆరోగ్య రక్షణ కోసం కేసీఆర్ హెల్త్ సిటీ ఆలోచనను తీసుకువచ్చారని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ అభివృద్ధిపై దృష్టి పెడుతోందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను కేసీఆర్‌కు పేరు వస్తుందనే కారణంతో ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి పరిస్థితి దయనీయంగా మారిందని, ఏడాదిన్నరగా గుండె శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయని తెలిపారు. గతంలో తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మూడు ఆక్సిజన్ ప్లాంట్లలో ఒక్కటి కూడా ప్రస్తుతం పనిచేయక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.
ఇకపై ప్రభుత్వ వైఫల్యాలపై రాజీ పడబోమని హరీశ్ రావు హెచ్చరించారు. "రెండేళ్లు ఓపిక పట్టాం. ఇక నుంచి గట్టిగా ప్రశ్నిస్తాం" అన్నారు. అసెంబ్లీలో కెమెరాలు తిప్పకుండా, మైకులు కట్ చేయకుండా చర్చించేందుకు ముఖ్యమంత్రికి సాహసం ఉందా? అని సవాల్ విసిరారు. అభివృద్ధి పనుల్లో ఇదే పరిస్థితి కొనసాగితే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు.జర్నలిస్టుల సంక్షేమం అంశాన్ని కూడా హరీశ్ రావు ప్రస్తావించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ప్రత్యేక హెల్త్ స్కీమ్ అమలు చేశామని గుర్తుచేశారు. జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లతో ప్రత్యేక ఫండ్ ఏర్పాటు చేశామని చెప్పారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బడ్జెట్లలో జర్నలిస్టుల కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు.
రెండున్నరేళ్లలో ఒక్కరికైనా కొత్త అక్రిడిటేషన్ కార్డు జారీ చేశారా? అని ప్రశ్నించారు. జర్నలిస్టులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా వెంటనే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలని, లేకపోతే ప్రమాదాల సమయంలో కుటుంబాలు ఇబ్బందులు పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంతో సమానంగా జర్నలిస్టులకు



కూడా ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. వరంగల్ పర్యటనలో హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదురే సూచనలు కనిపిస్తున్నాయి. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై రాబోయే రోజుల్లో రాజకీయ వాదోపవాదాలు మరింత పెరగనున్నాయి.

## జర్నలిస్టులకు ఒక్క రూపాయి ఇవ్వలేదు

- జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపణ
- రెండు బడ్జెట్లలో జర్నలిస్టులకు నిధులు కేటాయించలేదని విమర్శ
- అక్రిడిటేషన్లు, హెల్త్ స్కీమ్ వెంటనే అమలు చేయాలని డిమాండ్

హైదరాబాద్, (ప్రజాస్వరం):

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి. హరీశ్ రావు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, వారిని చూస్తేనే విసుక్కుంటోందని ఆరోపించారు. ఇవాళ వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.
ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు హెల్త్ స్కీమ్ తెచ్చామని, జర్నలిస్టులకు పూర్తి ఉచితంగా సేవలు అందించామని గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జర్నలిస్టుల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేశారని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బడ్జెట్లలో జర్నలిస్టులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ప్రశ్నించారు.
రెండున్నరేళ్లలో ఒక్కరికైనా కొత్త అక్రిడిటేషన్ కార్డు ఇచ్చారా? అని ప్రభుత్వంపై హరీశ్ రావు ధ్వజమెత్తారు. జర్నలిస్టులకు ఎలాంటి నిబంధనలు లేకుండా వెంటనే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసినట్లుగానే జర్నలిస్టుల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌కు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని, లేకపోతే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంతో సమానంగా జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను కూడా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## రైతు ప్రయోజనాలు తాకట్టు పెట్టారు

మొదటిపేజీ తరువాయి



'కిసాన్ మహా చౌపాల్' సభలో పాల్గొన్న ఆయన, ఈ ఒప్పందం దేశ రైతుల ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. సభలో మాట్లాడుతూ రాహుల్ గాంధీ, అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం అత్యంత రహస్యంగా జరిగిందని ఆరోపించారు. ఈ నిర్ణయం తీసుకునే ముందు పార్లమెంట్‌లో చర్చ జరగలేదని, కేబినెట్‌ను కూడా సంప్రదించలేదని అన్నారు. ఇది రైతుల గుండెల్లో గుచ్చిన బాణం లాంటిదని వ్యాఖ్యానించారు.
ఈ ఒప్పంద పత్రం అమెరికా నిబంధనలకు అనుగుణంగా తయారైందని, భారత ప్రభుత్వం కేవలం ఆమోదం తెలిపిందని విమర్శించారు. దేశ ప్రజల డేటాను కూడా ఈ ఒప్పందం ద్వారా అమెరికాకు అప్పగించారని ఆరోపించారు. అమెరికా సుప్రీం కోర్టు ఇచ్చిన తాజా తీర్పు నేపథ్యంలో ఈ డీల్‌ను రద్దు చేసే ధైర్యం ప్రధానికి ఉందా? అని సవాల్ విసిరారు.యువ కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రధాని మోదీని చూసి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా సభను వదిలి వెళ్లారని ఆరోపించారు. దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత ఇమేజ్‌ను కాపాడుకోవడానికే ప్రధాని చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.
వివాదాస్పద ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన ఫైల్స్ అంశాన్ని కూడా రాహుల్ ప్రస్తావించారు. ఆ కేసులో కొంతమంది భారత నేతల పేర్లు ఉన్నాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో మరికొంత మంది సీనియర్ నాయకుల పేర్లు బయటకు రావచ్చని వ్యాఖ్యానించారు.జాతీయ భద్రత అంశంపై కూడా రాహుల్ గాంధీ ప్రశ్నలు లేవనెత్తారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే తన పుస్తకంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, చైనా సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పుడు నిర్ణయాల విషయంలో స్పష్టత లేకపోయిందని అన్నారు. యుద్ధం చేయాలా వద్దా అన్నది రాజకీయ నిర్ణయం కావాలని, అది సైన్యంపై మోపకూడదని స్పష్టం చేశారు.
ఇండో-యూఎస్ ట్రేడ్ ఒప్పందంపై ఆయన మరోసారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుందని, రైతులు మరియు వ్యవసాయ కార్మికులు దీనిని అంగీకరించలేదని అన్నారు. ఐదు నెలల పాటు చర్చలు నిలిచిపోయాయని, అయినప్పటికీ చివరకు ప్రధాని నేరుగా అమెరికా అధ్యక్షుడితో మాట్లాడి ఒప్పందానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. "కొన్ని నెలలు ఎలాంటి పురోగతి లేదు. ఒక్కసారిగా నిర్ణయం తీసుకుని రైతులను అమ్మేశారు. గార్మెంట్ రంగాన్నీ నష్టపరిచారు. దేశ డేటాను విదేశాలకు అప్పగించారు," అని రాహుల్ తీవ్రంగా విమర్శించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
దేశవ్యాప్తంగా పెద్ద కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యం పెరుగుతోందని, ఒక సంస్థ పేరే ఎక్కడ చూసినా వినిపిస్తోందని కూడా ఆయన విమర్శించారు. ప్రభుత్వ విధానాలు కొందరి ప్రయోజనాల కోసం మలచబడుతున్నాయనే అనుమానం ప్రజల్లో ఉందన్నారు.పార్లమెంటరీ వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేతగా తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని చెప్పారు. సభలో మాట్లాడడం ప్రారంభించగానే అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.
రైతుల ప్రయోజనాలు, జాతీయ భద్రత, పార్లమెంటరీ సంప్రదాయాల పరిరక్షణలో కేంద్రం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాహుల్ కోరారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు ముందుకు రాకూడదని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రజలతో కలిసి ఈ అంశాలపై పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.భోపాల్ వేదికగా జరిగిన ఈ సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఆరోపణలకు ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. అమెరికా వాణిజ్య ఒప్పందం అంశం రాబోయే రోజుల్లో పార్లమెంట్‌తో పాటు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసే అవకాశముంది.



## ఆ వెయ్యి కోట్లు ఎక్కడ్నించి తెచ్చావు?


మొదటిపేజీ తరువాయి

ఉన్న చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పరామర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.
ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజా సమస్యలపై కాకుండా, రేవంత్ రెడ్డి గాంధీ కుటుంబానికి సమర్పించుకుంటున్న వేల కోట్ల రూపాయల గురించే చర్చ జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. రెండేళ్ల కాలంలోనే ఢిల్లీకి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వద్ద వెయ్యి కోట్లు సిద్ధంగా ఉన్నాయంటే, రాష్ట్ర ప్రజల సొమ్మును ఇంకెన్ని వేల కోట్లు మింగేశారో అర్థం చేసుకోవాలని అన్నారు. "ఆ వెయ్యి కోట్లు నీ అయ్యా సొమ్మా? లేక నీ అబ్బ సొమ్మా? ఎక్కడి నుంచి తెచ్చావు?" అని ముఖ్యమంత్రిని ఉద్దేశించి కేటీఆర్ ఘాటుగా ప్రశ్నించారు. ప్రజల కష్టార్జితాన్ని దోచుకుని గాంధీ కుటుంబానికి కప్పం కడతారా అంటూ మండిపడ్డారు.
రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అగాధంలోకి నెట్టిందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో డిసెంబర్‌లోనే రైతుల ఖాతాల్లో చేరే రైతుబంధు నిధులు, మార్చి నెల వచ్చినా ఇప్పటికీ అందించలేకపోయారని ఎద్దేవా చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివి, రుణమాఫీ చేసే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేవని దుయ్యబట్టారు. కనీసం రైతులు పండించిన జొన్న, పత్తి పంటలను కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన చరిత్ర రేవంత్ రెడ్డిదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి ఇంత బాహాటంగా అవినీతికి పాల్పడుతుంటే ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఏం చేస్తున్నాయని ఆయన నిలదీశారు.

## సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ...

మొదటిపేజీ తరువాయి

ఒకటిగా నిలబెట్టడమే లక్ష్యంగా 'సేవా సంకల్ప్' పేరిట ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది.
నేడు 'సేవా తీర్థ్' ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశం దేశ ప్రగతి ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది అని కేబినెట్ అభివర్ణించింది. వలసవాద గతం నుంచి ఆత్మవిశ్వాసంతో కూడిన నవ భారతం వైపు సాగుతున్న ప్రయాణానికి ఈ నూతన పరిపాలనా కేంద్రం ఒక శక్తివంతమైన చిహ్నమని తీర్మానంలో పేర్కొన్నారు. 'సేవా తీర్థ్' అనే పేరు సేవ, బాధ్యత, అంకితభావాలకు ప్రతిరూపమని, ఇక్కడ పరిపాలనను ఒక పవిత్ర యాత్రగా భావిస్తామని వివరించారు. ఈ సమావేశంపై ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ.. "స్వదేశీ ఆలోచన, ఆధునిక దృక్పథం, 140 కోట్ల ప్రజల అపార సామర్థ్యంతో భారత దేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు సంకల్పం చేశాం" అని తెలిపారు.
ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాల్లో భాగంగా, బాలికల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక (హెచ్‌పీవీ) 'గర్డాసిల్' టీకాను అందించే కార్యక్రమానికి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా, కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఆమోదించింది.
మౌలిక సదుపాయాల కల్పనకు ఊతమిస్తూ సుమారు రూ.12,236 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



ఇందులో అహ్మదాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టు, జబల్‌పూర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణలకు కూడా ఆమోదం లభించింది.
ప్రభుత్వ పరిపాలన అధికార కేంద్రంగా కాకుండా, ప్రజల సాధికారతకు కేంద్రంగా పనిచేయాలని 'సేవా సంకల్ప్' తీర్మానంలో స్పష్టం చేశారు. 'నాగరిక దేవో భవ' (పౌరుడే దైవం) అనే సూత్రాన్ని పాటిస్తూ, ప్రతి నిర్ణయం 140 కోట్ల ప్రజల సేవకే అంకితమవుతుందని పేర్కొన్నారు. గత దశాబ్దంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడాన్ని గుర్తుచేస్తూ.. 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' వేగంతో భారత్‌ను త్వరలోనే ప్రపంచంలోని టాప్3 ఆర్థిక శక్తిగా నిలబెట్టేందుకు దృఢ సంకల్పం తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం మీద, ఈ సమావేశం 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక బలమైన పునాది వేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## కేరళ ఇకపై కేరళం..

- కేరళ పేరును 'కేరళం'గా మార్చేందుకు కేంద్రం ఆమోదం
- కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- మలయాళ ఉచ్చారణకు అనుగుణంగా పేరు మార్పు ప్రతిపాదన
- రాజ్యాంగ సవరణ ద్వారా అధికారికంగా మారనున్న పేరు

తిరువనంతపురం, (ప్రజాస్వరం):

కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ మేరకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో కేరళ ప్రజల చిరకాల డిమాండ్ నెరవేరనుంది.
మలయాళ భాషలో కేరళ రాష్ట్రాన్ని 'కేరళం' అనే పిలుస్తారు. ఈ స్థానిక ఉచ్చారణకు అనుగుణంగా అధికారిక పేరును కూడా మార్చాలని కోరుతూ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని ప్రభుత్వం 2024 జూన్ 24న శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. ఈ ప్రతిపాదనకే ఇప్పుడు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. గతంలో 2023లోనూ ఇలాంటి తీర్మానం చేసిన విషయం తెలిసిందే.
కేంద్ర మంత్రివర్గం ఆమోదం తర్వాత ఈ ప్రక్రియ మరో దశకు చేరుతుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, రాష్ట్రపతి 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను రాష్ట్ర శాసనసభ అభిప్రాయం కోసం పంపుతారు. అక్కడి నుంచి ఆమోదం లభించాక, ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన తర్వాత రాజ్యాంగ సవరణ ద్వారా పేరు మార్పు అధికారికంగా అమల్లోకి వస్తుంది.
వచ్చే ఏప్రిల్‌మే నెలల్లో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ఒరిస్సాను 'ఒడిశా'గా, పాండిచ్చేరిని 'పుదుచ్చేరి'గా మార్చిన తరహాలోనే ఇప్పుడు కేరళ పేరు కూడా మారుతోంది.



## ఆర్టీసీ నాయకుల ముందస్తు అరెస్టులు

- ఛలో సెక్రటేరియట్ అడ్డుకట్ట.
- ముగ్గురు ఆర్టీసీ నాయకుల అరెస్టు

కాప్రా,ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):

'ఛలో సెక్రటేరియట్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కుషాయిగూడ డిపోకు చెందిన ఆర్టీసీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో సాజిద్ మహమ్మద్, మచ్చ బాబు, ఈ. నరేందర్ కుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా సాజిద్ మహమ్మద్ మాట్లాడుతూ, ప్రభుత్వ మేనిఫెస్టోలో ఆర్టీసీకి సంబంధించిన హామీలను అమలు చేయాలని కోరుతూ శాంతియుతంగా చేపట్టిన 'ఛలో సెక్రటేరియట్' కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇచ్చి, అనంతరం ముందస్తు అరెస్టులు చేయడం విచారకరమన్నారు.




భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల మేరకు నిరసనలు తెలపడం నేరమా అని ప్రశ్నించారు. ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులు ఈ అంశంపై స్పందించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ఆర్టీసీ ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## స్కూల్ జోన్‌లో వరుస ప్రమాదాలు

- పట్టించుకోని అధికార యంత్రాంగం

నాగారం,ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):

ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌లో స్కూల్ జోన్ ప్రాంతంలో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకోవడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రతిరోజూ ప్రాణాల మీదకు తెచ్చుకుని రోడ్డును దాటాల్సిన పరిస్థితి నెలకొంది. స్కూల్ సమీపంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, హెచ్చరిక బోర్డులు సరిగా లేకపోవడం, జీబ్రా క్రాసింగ్ చెరిగిపోవడం వంటి కారణాలతో వాహనాలు అధిక వేగంతో దూసుకెళ్తున్నాయి.



ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.




## న్యాయవాదుల రక్షణ చట్టం సాధించేవరకు పోరాటం.

- **వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. కిరణ్ కుమార్.**

**వనపర్తి,ఫిబ్రవరి 24 (ప్రజాస్వరం):**

న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. చట్టం సాధించేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం వనపర్తి జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయం నుంచి న్యాయవాదులు పాదయాత్ర ప్రారంభించి భూత్పూర్ వద్ద కొన్ని కారణాల వల్ల నిలిపివేశామని తెలిపారు. ఈ నెల 23న భూత్పూర్ నుంచి చలో సెక్రటేరియట్ పాదయాత్రను తిరిగి ప్రారంభించినట్లు చెప్పారు. పాదయాత్రకు మద్దతుగా ఈ నెల 27 వరకు వనపర్తిలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి ఇబ్బందులు లేవని, అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై వరుస దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు సంఘటితంగా శాంతియుత నిరసనలు కొనసాగించి చట్టం సాధించుకుంటామని స్పష్టం చేశారు. మొదటి రోజు దీక్షలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. కిరణ్ కుమార్,కార్యదర్శి వెంకటరమణతో పాటు న్యాయవాదులు బ్రహ్మం,అశోక్ రావు,ధారా వెంకటేష్,శ్యామ్, నరేంద్రబాబు ,త్రినాథ్,రఘువంశి, రాహుల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వనగంటి నాగేశ్వర్,మోహన్ గౌడ్,మోహన్ కుమార్,వెంకటేశ్వర్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, తిరుపతయ్య గౌడ్,కృష్ణవర్ధన్ రెడ్డి,చంద్రశేఖర రావు, మన్మోహనరావు,శశిభూషణ్, దినేష్ రెడ్డి,తిరుపతయ్య తదితరులు హాజరయ్యారు. మహిళా న్యాయవాదులు పుష్పలత,కళ్యాణి,రేణుక,లక్ష్మి జూనియర్ కూడా పాల్గొన్నారు.




## ఇంటర్,పదో పరీక్షలకు 5 నిమిషాల ఆలస్యానికి అనుమతి

- **పరీక్ష మొదలైన తర్వాత 5 నిమిషాల వరకూ ప్రవేశం**

**మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 24 (ప్రజాస్వరం):**




రాష్ట్రంలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను పరీక్ష ప్రారంభమైన తర్వాత కూడా ఐదు నిమిషాల వరకు కేంద్రాల్లోకి అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరీక్షల నిర్వహణపై ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్, మార్చి 14 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో పోలీస్ బందోబస్తు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, వైద్య సదుపాయం కల్పించాలని సూచించారు. ఏ విద్యార్థి నేలపై కూర్చోకుండా బెంచీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈసారి ఇంటర్ ఫస్ట్ ఇయర్‌కు 4,89,055 మంది, సెకండ్ ఇయర్‌కు 4,53,832 మంది, పదో తరగతికి 5,28,239 మంది విద్యార్థులు హాజరవుతున్నారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధించగా, అత్యవసర పరిస్థితుల్లో చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ప్రశ్నాపత్రాలపై క్యూ.ఆర్ కోడ్, సీరియల్ నెంబర్ ఉంటాయని, పరీక్షకు 15 నిమిషాల ముందు మాత్రమే తెరవాలని స్పష్టం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం 151 కేంద్రాలు ఏర్పాటు చేసి, 1.35 లక్షల మంది హాజరవుతారని కలెక్టర్ మను చౌదరి తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు.

## బాన్సువాడ ముదిరాజ్ ఇన్చార్జిగా మంత్రి గణేష్

**కామారెడ్డి జిల్లా,ఫిబ్రవరి 24 (ప్రజాస్వరం):**

బాన్సువాడ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఇన్చార్జిగా మంత్రి గణేష్‌ను నియమిస్తున్నట్లు ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షులు భూపాల్ విజయనంద్ చేతులమీదుగా మంత్రి గణేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ముదిరాజ్ కులస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిర్వహిస్తానని, తన ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు అన్నారు.



# అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

- **ఎలిజిబెత్ రేఖ**
- **ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా కార్యదర్శి(సి.ఐ.టి.యు)**

**వేటపాలెం,ఫిబ్రవరి 24 (ప్రజాస్వరం):**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోట్లు తీసుకొచ్చి కార్మికులను వీధుల పాలు చేసిందని అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని హామీలిచ్చి నెరవేర్చకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ బాపట్ల లోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల్లో అంగన్వాడీలు కూర్చొన్నారు.అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని గత ప్రభుత్వ హయాంలో 42 రోజుల పాటు సమ్మె నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలో కూటమి నాయకులు అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీల జీతాలు, పెంచుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఇంత వరకూ ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు.అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని విమర్శించారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలన్నారు. వేసవి సెలవుల జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**సిఐటియు బాపట్ల జిల్లా కార్యదర్శి సి.హెచ్. మజుందార్ మాట్లాడుతూ...**

ఐదు సంవత్సరంలోపు పిల్లలు విధిగా అంగన్వాడీ స్కూల్లో చదివేలా జీవో విడుదల చేయాలన్నారు. అంగన్వాడీలకు వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలన్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బాపట్ల కన్వీనర్ శరత్ అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు నాయకులు కార్యకర్తలు శైలశ్రీ,హేమమాలిని, సీతామహాలక్ష్మి,హైమా,శ్రీలత,బేబీ రాణి,భారతి ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## హైకోర్టు తీర్పుతో ఉద్యమకారుల్లో ఆశలు

- **హైకోర్టు తీర్పు చారిత్రాత్మకం: దొమ్మాటి కిరణ్ కుమార్ రావు**

**కాప్రా,ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల పట్ల సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా కన్వీనర్ దొమ్మాటి కిరణ్ కుమార్ రావు తెలిపారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల మేరకు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ పలువురు ఉద్యమకారులు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు వారికి న్యాయం జరిగే దిశగా కీలకమని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన వారి సంక్షేమాన్ని విస్మరించకూడదని, వారికి రావాల్సిన ఫలాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం స్పష్టం చేయడం ఉద్యమకారులకు ఉత్సాహాన్నిస్తుందని అన్నారు. ఈ కేసు విచారణలో పిటిషనర్ల తరపున న్యాయవాది కరుణాకర్ రెడ్డి బలమైన వాదనలు వినిపించడం అభినందనీయమని తెలిపారు. ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించి ప్రభుత్వం ప్రకటించిన అభయ హస్తం పథకం కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి హైకోర్టు తీర్పుతో క్షేత్రస్థాయిలో ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులైన ఉద్యమకారులకు తక్షణ సాయం అందించడం ప్రభుత్వ బాధ్యత అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ జోక్యంతో ఉద్యమకారుల సమస్యలు పరిష్కార దిశగా అడుగులు పడటం సంతోషకరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో సర్వస్వం కోల్పోయిన ఉద్యమకారులకు గతంలో జరిగిన అన్యాయాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు అండగా నిలుస్తున్న హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఉద్యమ నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## హాల్ టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్షలకు అనుమతి.

- **జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎర్ర అంజయ్య.**

**వనపర్తి,ఫిబ్రవరి 24 (ప్రజాస్వరం):**



హాల్ టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా విద్యార్థులను ఇంటర్ పరీక్షలకు అనుమతిస్తామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎర్ర అంజయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కొందరు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మీసేవ లేదా ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పరీక్షా కేంద్రాలకు వెళ్లి పరీక్షలకు హాజరుకావచ్చని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఐఈఓ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద కూడా సిబ్బందికి తగిన సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయవద్దని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే జిల్లా ఇంటర్ విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

## మల్దకల్ మండలంలో చిరుత కలకలం.





- **భయం గుప్పిట్లో కుర్తి రావులచెరువు!**

**మల్దకల్,ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):**

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో చిరుత పులి సంచారం కలకలం రేపుతోంది. కుర్తి రావులచెరువు గ్రామ రైతు పటేల్ జనార్దన్ రెడ్డి నిమ్మ, జామ తోటల్లో చిరుత అడుగుజాడలు కనిపించడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత వారమే మద్దెలబండ చిన్న తండాలో చిరుత ఆవును, దూడను చంపి తిన్న ఘటన మరువకముందే, ఇప్పుడు కుర్తి రావులచెరువు సమీపంలో అడుగుజాడలు బయటపడటం రైతుల్లో వణుకు పుట్టిస్తోంది. పొలాలకు వెళ్లాలంటేనే జనం భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు తక్షణమే స్పందించి, చిరుతను బంధించి తమ ప్రాణాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## రూ.1.90 లక్షల వ్యయంతో సిసి రోడ్ల పనులకు భూమి పూజ చేసిన టిడిపి నేతలు.

- **కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలలో అభివృద్ధి సాధ్యం**
- **రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రామా కాంత్ రెడ్డి.**

**పెద్దకడబూర్ ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):**




కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలలో అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రామకాంత్ రెడ్డి స్పష్టం చేశారు, మంగళవారం పెద్ద కడుబూరు మండలంలో ఒక కోటి 90 లక్షల తో 3.0 కింద ఎన్ ఆర్‌ఈ జి ఎస్ మెటీరియల్ వర్క్ ద్వారా సిసి రోడ్లో మంజూరు అయ్యాయని తెలిపారు, ఈ సందర్భంగా రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవరామకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి పరుగులు తీస్తుందని పేర్కొన్నారు, సిసి రోడ్లకు భూమి పూజ చేశారు, గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉండగా ఒక జాండెడ్ సిసి రోడ్డు కూడా మూరేడు తార్ రోడ్డు కూడా వేసిన దాఖలు లేవని స్పష్టం చేశారు, వైయస్సార్ నాయకులు ఇప్పుడు భూమి పూజలు చేయడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు, అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు వైఎస్ఆర్సిపి నాయకులకు లేదని ధీమా వ్యక్తం చేశారు, కూటమి ప్రభుత్వం అంటే అభివృద్ధి సంక్షేమం అభివృద్ధి రెండు సమపాలలో పరిపాలన సాగుతుందని స్పష్టంగా వివరించారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికార మెంబర్ మల్లికార్జున, సొసైటీ సింగిల్ విండో చైర్మన్ మీసేవ ఆంజనేయ, శివన్న, నరసింహులు, గుమ్ములఆశన్న, మంచోది ఆదము, హనుమంతు, సుధాకర్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఇంటర్, టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- **వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు.**


**వనపర్తి,ఫిబ్రవరి 24 (ప్రజాస్వరం):**



జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో సమన్వయం కీలకమని, ప్రతి శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లా కలెక్టర్లతో ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక బస్సులు నడపాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలను మూసివేసి, బిఎన్‌ఎస్ సెక్షన్ 163 (సీఆర్పీసీ 144) అమలు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు. జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు మొత్తం 12,653 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం 6,216 మంది, ద్వితీయ సంవత్సరం 6,437 మంది విద్యార్థులు 25 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. అలాగే పదో తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు 37 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 7,228 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రశ్నాపత్రాల రవాణా సమయంలో ప్రత్యేక భద్రత కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో త్రాగునీరు, సరిపడ బెంచీలు, లైటింగ్, వైద్య శిబిరాలు వంటి సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అంజయ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధికారుల కనుసన్నల్లోనే అంబేద్కర్ విగ్రహ స్థాపనకు ఆటంకం.

- **గాంధీనగర్ అంబేద్కర్ విగ్రహ స్థాపన స్థల కబ్జాదారులకు అండగా నిలిచిన కొందరు అధికారులు.**
- **పూర్తి వివరాలతో త్వరలో జాతీయ ఎస్సీ కమిషన్ను కలవనున్న దళిత సంఘాలు.**



GOVERNMENT OF TELANGANA
OFFICE OF THE COLLECTOR AND DISTRICT MAGISTRATE
BHADRADRI KOTHAGUDEM

Rc.No.E2/4598/2025 Date: 12.2025

From: Sri. Jitesh V. Patil, I.A.S., Collector and District Magistrate, Bhadradri Kothagudem.

To: The Project Officer, ITDA, Bhadrachalam. The District Forest Officer, Kothagudem.

Sir,

Sub: Representation - Bhadradri Kothagudem District - Bhadrachalam Division - Burgampad Mandal - Representation of Sri Sudipaka Punnaiah S/o Saibu R/o Rajivnagar Colony, Sarapaka, Burgampad Mandal - Requested to take necessary action - Report called for - Reg.

Ref: Representation of Sri Sudipaka Punnaiah S/o Saibu R/o Rajivnagar Colony, Sarapaka, Burgampad Mandal, Dt: 04-12-2025.

&&&

I invite attention to the reference cited where in, Sri.Sudipaka Punnaiah S/o Saibu R/o Rajivnagar Colony, Sarapaka, Burgampad Mandal, has submitted a representation stating that, the land in Sy.No. 262/1 to an extent of Ac. 1904.00 gts situated at Sarapaka Revenue village of Burgampad Mandal, is Forest land. But Smt. Jarupula Nagamma W/o Bhadraiah has filed W.P.No. 15373 of 2025, interim order was issued. Further he requested to take action against Smt. Jarupula Nagamma W/o Bhadraiah for illegal construction, and do justice to them.

In view of the above, it is requested to conduct detail enquiry into the matter personally and take necessary action as per norms and submit action taken report to this office under intimation to the applicant without fail.

Encl: As above

Yours faithfully
Sd/-D.Venu Gopal
Additional Collector
for Collector
Bhadradri Kothagudem

//Attested//
Superintendent (OSE)

Copy to the Tahsildar, Burgampadu for necessary action.
Copy to Sri Sudipaka Punnaiah S/o Saibu R/o Rajivnagar Colony, Sarapaka, Burgampad Mandal.

**బూర్గంపాడు ఫిబ్రవరి 24 (ప్రజాస్వరం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మేజర్ గ్రామ పంచాయతీ సారపాక గాంధీనగర్ నందు అంబేద్కర్ విగ్రహ స్థలము కొందరు కబ్జా చేసి బిల్డింగ్ కట్టుకుంటున్న తరుణంలో సంబంధిత విషయాలను అధికారులకు తెలియజేసి జిల్లా కలెక్టర్ మరియు కోర్టు నుంచి నోటీసులు కబ్జాదారులకు అందించిన స్థానికంగా ఉన్న కొందరు అధికారులు వారికి అండగా నిలిచి నిలిపివేయాల్సిన కట్టడాన్ని దగ్గరుండి వాళ్లే కట్టిస్తున్నట్టు పలు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.పూర్తి ఆధారాలతో ఇక్కడ జరుగుతున్న పరిణామాలను జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకు వెళ్లే దిశగా అడుగులు వేస్తున్న దళిత సంఘాలు.భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ స్థాపన స్థలాన్ని కబ్జా చేసి బిల్డింగ్ కట్టుకుంటుంటే కబ్జాదారుల కోరల్లో నుంచి స్థలాన్ని విడిపించి అంబేద్కర్ విగ్రహ స్థాపన చేయాల్సిన అధికారులే కబ్జాదారులకు కొమ్ముకాస్తుంటే సమాజం సిగ్గుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది అంటూ విమర్శలు గుప్పిస్తున్న స్థానిక ప్రజలు.ఇకనైనా మండల అధికారులు అంబేద్కర్ విగ్రహ స్థాపనకు బాసటగా నిలవాలని దళిత సంఘాలు కోరుకుంటున్నాయి.

## మొగిలిపాక గ్రామంలో ఆర్థిక సహాయం అందజేసిన కిరణ్ రెడ్డి


- **లక్ష్మి నరసింహ స్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ కుమార్ రెడ్డి**

**వలిగొండ ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం మొగిలిపాక గ్రామానికి చెందిన షేక్ ఖాసీం ఇటీవల చిట్యాల నుండి గ్రామానికి వస్తున్న సమయంలో మార్గ మధ్యలో ప్రమాదానికి గురై వలిగొండ రేణుక హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు అని తెలుసుకొని పరామర్శించి వైద్య ఖర్చులకు నిమిత్తం 5000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన మొగిలిపాక అభివృద్ధి ప్రదాత శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి ఈ కార్యక్రమంలో గ్రామా సర్పంచ్ జడిగే బుచ్చయ్య యాదవ్,ఉప సర్పంచ్ షేక్ సైదులు, బిఅర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బీమనబోయిన బిక్షపతి, వార్డు సభ్యులు పబ్బు వెంకటేష్,పబ్బు శిరీష బాలకృష్ణ, మచ్చ సునీత స్వామి,మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య,మాజీ ఉప సర్పంచ్ విష్ణు చారి, మాజీ పాల సంఘం చైర్మన్ జక్క ఇంద్ర రెడ్డి మరియు బిఅర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## యూరియా యాప్ ను రద్దు చేయాలి

- **రైతు హక్కుల సాధన సమితి మండల అధ్యక్షులు పైళ్ల మల్లారెడ్డి**



**వలిగొండ ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో రైతుల హక్కుల సాధన సమితి మండల అధ్యక్షులు పైళ్ల మల్లారెడ్డి మాట్లాడుతూ ఓట్ల కోసం రాజకీయనాయకులు రైతును రాజు చేస్తా మని చెప్పిన మాటలు వట్టిమాట లేనని రైతు హక్కుల సా ధన సమితి మండల అధ్యక్షులు పైళ్ళ మల్లారెడ్డి అన్నారు ఈ సందర్భంగా డిసెంబర్ నెలలో ఇస్తానన్న రైతు భరోసాని సంక్రాంతికి అని చెప్పి మళ్ళీ మున్సిపల్ ఎన్నికల తర్వాత అని మాట మార్చడం ఎంతవరకు సమంజసం అని వారన్నారు. అంతేకాకుండా శాటిలైట్ ద్వారా పంటవేసిన భూములకు మాత్రమే రైతు భరోసా అనడం వారి పబ్బం గడపడం కోసమేనని వారు తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ వల్ల రైతుకు నష్టమే తప్ప లాభమేమి లేదని వారు తెలిపారు. యూరియా కోసం మొబైల్లో బుక్ చేసుకుందామంటే జీరోలు తప్ప బస్తాలు ఏమి కనపడటం లేదని వారు తెలిపారు. కేవలం నిమిషాల వ్యవధిలోనే బస్తాలు అయిపోవడం మిగిలిన రైతులకు అన్యాయమేనని తెలిపారు. ఇక కరెం టు కోత విషయానికొస్తే రోజులో కొన్ని గంటలు కరెంటును తీసేస్తూ రైతుకు పంటకు సకాలంలో సాగునీరు అందక దిగుబడి రాకుండా నష్టపోతున్నారని తెలిపారు. ఏది ఏమైనప్పటికీ రైతుకు సకాలంలో రైతు భరోసాను అందించి, రైతుకు పంటకు అవసరమైన ఎరువులను ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎరువులను అందించి, కరెంటును అందజేసినట్లయితే రైతుకు న్యాయం చేసిన వారు అవుతారని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పెబ్బేర్ సంత స్థలం భారీ అవినీతి, దోపిడికి కుట్ర

- **నైతికత ఉంటే ఇచ్చిన మాట ప్రకారం సంత స్థలం ప్రభుత్వానిదే అని బోర్డు పెట్టాలి స్వాధీనం చేసుకోవాలి.**
- **భూసేకరణ పేరిట నాటకాలెందుకు ప్రజలను వంచించడానికా. రాజకీయ లబ్ధికోసం విషప్రచారం చేసిన నాయకులు**
- **మాకు,ప్రజలకు క్షేమాపణలు చెప్పాలి.**
- **మాజీ మంత్రి సింగిరెడ్డి. నిరంజన్ రెడ్డి**



**వనపర్తి,ఫిబ్రవరి 24 (ప్రజాస్వరం):** గత మూడు దశాబ్దాలుగా న్యాయస్థానంలో పెబ్బేర్ సంత స్థలవివాదం సర్వే నంబర్ 392 భూ యజమానులకు,దేవాదాయ శాఖ కు మధ్య కొనసాగుతున్నదని పలుమార్లు భుయజమానులకు వరుసగా 2003,2007,2022అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.మంగళవారం పెబ్బేర్ లో విలేకరుల సమావేశములో మాట్లాడారు. న్యాయస్థానాన్ని అతిక్రమించి రాజకీయ లబ్ధి కోసం ఎన్నికల సమయములో 30ఎకరాల 19గుంటలు మొత్తం ప్రభుత్వానిదేనని ఇందులో నేను కబ్జా చేయడానికి కుట్ర చేస్తున్నాను అని నీచమైన,నిరదారణమైన ఆరోపణలు చేసి ఒక్కటంటే ఒక్క నెలలో సంత స్థలం మొత్తం ప్రభుత్వపరం చేసుకుంటామని బీరాలు పలికిన నాయకులు మూడేండ్లు గడుస్తున్నా నేటికి మాట నిలబెట్టుకోకుండా పోవడమే కాకుండా నేడు భూసేకరణ పేరిట భారీ దోపిడికి కుట్ర చేయడం సిగ్గుచేటైన విషయం అని నిరంజన్ రెడ్డి* తీవ్రంగా విమర్శించారు. పెబ్బేరు ప్రజల,వ్యాపారస్తుల క్షేమం కోసం భూ యజమానులతో ప్రభుత్వపరంగా సంత కోసం 16ఎకరాలు ఇస్తే ప్రత్యామ్నాయంగా వ్యవసాయ భూమి ఇప్పిస్తామని ఒప్పించి యజమానులతో అంగీకార పత్రం(గిఫ్ట్ డీడ్)ఇప్పించేశామని ఇంతలో ఎన్నికలు రావడం పోటీలో ఉన్న మూర్ఖులు,వెధవలు రాజకీయంగా నన్ను ఎదుర్కొనలేక నేనేదో కబ్జా చేశానని దుష్ప్రచారం చేశానని ప్రచారం చేశారని అన్నారు. నేడు న్యాయస్థానం 30ఎకరాల 19గంటల భూమి యజమానులకు చెందుతుందని తీర్పు ఇవ్వడంతో ప్రగల్భాలు పలికిన నాయకులు ఎక్కడని నిరంజన్ రెడ్డి* దుయ్యబట్టారు. భూసేకరణ పేరిట భారీ అవినీతికి,దోపిడికి కుట్ర, 30ఎకరాల 19 గుంటల భూమి ఎటువంటి పరిహారం ఎవరికి ఇవ్వకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని సంతకు వినియోగిస్తామని కుర్చీ వేసుకొని ఒక్క నెలలో ప్రహరీ గోడ కడతామని ప్రగల్భాలు పలికిన నాయకులు న్యాయస్థాన తీర్పుతో ఖంగుతిని ప్రజల ముందు అభాసుపాలు అవుతామని భూసేకరణ పేరిట భారీ దోపిడికి తెరలేపారని నిరంజన్ రెడ్డిఆరోపించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం భూ యజమానులకు సంత స్థలంకు ప్రత్యామ్నాయంగా మన జిల్లా సరిహద్దులు దాటి అత్యంత విలువైన భూమిని ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరలో ఇప్పిస్తామని ఇందులో ముఖ్యమంత్రి సోదరుణ్ణి సహాయం తీసుకుంటున్నామని మేకిచ్చే భూమిలో సగం భూమికి వారికి ఇవ్వాల్సి ఉంటుందని భూయజమానులతో సంప్రదించడంతో వేల కోట్ల దోపిడికి కుట్ర చేశారని ఆరోపించారు. ఇంత అవినీతికి తెరలేపిన మీరు కబ్జాకోరులా....ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా ఉన్నంతలో సంత స్థలాన్ని కాపాడాలనుకున్న నేను కబ్జాకోరునా అని ప్రశ్నించారు. అకారణంగా ఆనాడు నాపై దుష్ప్రచారం చేసిన మీ పుట్టుకలో నైతికత ఉంటే మాకు ప్రజలకు బహిరంగ క్షేమాపణ చెప్పి తదుపరి కార్యాచరణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఈ సమావేశములో వనంరాములు,దిలీప్ రెడ్డి, కర్రెస్వామి,కౌన్సిలర్స్ సౌజన్య మన్యం,పెద్దింటి వెంకటేష్,ఎం రాజశేఖర్,విశ్వరూపం,ఎద్దుల. సాయి,గోపి,సహదేవుడు,శేఖర్ గౌడ్,వడ్డేరమేష్,రామకృష్ణ,శంభు.రాము, రాములు,భారతి ,మాధవ్ రెడ్డి,నరేష్,మొగిలన్న,అంజి,రాములు,పరమేశ్, అఖిల్,గిరి, వసంత్,సురేష్,శ్రీను, సోహెల్,మూర్తి,వేణు,ఉదయ్ పవన్,నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గ్రామములో యూరియా సెగ

**వలిగొండ ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్వగ్రామంలో రైతులు రోడ్డెక్కారు. యూరియా యాప్ బుకింగ్ పై అవగాహన లేకపోవడం, స్టాక్ దొరక్కపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వ నిబంధనల వల్ల సామాన్య రైతులకు ఎరువులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందించి తమకు యూరియా అందేలా చూడాలని డిమాండ్ చేశారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాల్లో విద్యాసంస్థల ఏర్పాటుకు నాయకులు కృషి చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు సూచించారు

- **ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం మీడియాతో మాట్లాడారు**




**కామారెడ్డి జిల్లా,ఫిబ్రవరి 24 (ప్రజాస్వరం):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తులపై ఆరోపణలు మానుకుని కళాశాల స్థలాల్లో విద్యాసంస్థల ఏర్పాటుకు నాయకులు కృషి చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. రాజకీయ నాయకులు కృషి చేయాలి ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తుల పరిరక్షణ కోసం రాజకీయ నాయకులు కృషి చేయాలన్నారు. కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. అరోరా ఇంజినీరింగ్ కళాశాల, సరస్వతి శిశు మందిర్ పాఠశాల, కర్షక్ బీఈడీ కళాశాలకు నాడు స్థలాలను ఎలా కేటాయించారని ప్రశ్నించారు. అలాగే అక్రమంగా స్థలాలను కబ్జా చేసుకుని కట్టడాలు చేసినా ఎందుకు అడ్డుకోలేదని నిలదీశారు. అరోరా కళాశాల, సరస్వతి శిశు మందిర్, కర్షక్ బీఈడీ కళాశాలల భవనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ విద్యాసంస్థలను స్థాపించాలని డిమాండ్ చేశారు. కళాశాల ఆస్తుల విషయంలో రాజకీయాలు చేసే అర్హత ఎవరికీ లేదన్నారు.కళాశాల ఆస్తులను కాపాడింది విద్యార్థి సంఘాలే.. కళాశాల ఆస్తులను కాపాడడం కోసం ప్రాణాలకు తెగించి కొట్లాడింది విద్యార్థి సంఘాలు మాత్రమేనని నాయకులు పేర్కొన్నారు. విద్యావసరాల కోసం రైతుల వద్ద నుంచి సేకరించిన డిగ్రీ కళాశాల భూమిలో ఇతరులకు కేటాయించిన సమయంలో ప్రశ్నించకుండా రాజకీయ నాయకులు అప్పుడు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ఇకనైనా ఆరోపణలు మానుకుని విద్యార్థుల భవిష్యత్తుకు బాసటగా నిలవాలని సూచించారు. మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్, కేంద్రీయ విద్యాలయం, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. కళాశాల ఆస్తుల పరిరక్షణ కోసం విద్యార్థి సంఘాలు ఏకమై జేఏసీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ, టీఎన్ఎస్ఎఫ్,పీడీఎస్యూ, బీవీఎం,జీవీఎస్,బీసీ,టీజేఎస్, విద్యార్థి సంఘాల నాయకులు అరుణ్,బాలు,సురేష్,విఠల్, వినోద్,లక్ష్మణ్,బులెట్,సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిన దిమాస్టర్మైండ్స్ ఈటెక్నో స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

**సంగారెడ్డి ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):** సదాశివపేటపట్టణంలోని ది మాస్టర్మైండ్స్ ఈటెక్నో స్కూల్ 1వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారంరోజున బసవసేవ సదన్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం సోమ వారం రోజున సాయంత్రం 6:00 గంటలకు ప్రారంభించబడింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్, 12 వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు, 26 వ వార్డు కౌన్సిలర్ అపర్ణ శివరాజ్ పాటిల్, 22 వ వార్డు కౌన్సిలర్ కొత్త గొల్ల సోమశేఖర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్కూల్ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభా ప్రదర్శనలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పిల్లల చేత భగవద్గీత శ్లోకాలు, దేశభక్తి గీతాలు, నాటికలు, విలేజ్ నకు సంబంధించిన లంబాడీ నృత్యాలు, ఫోక్ డాన్సులు వంటి కార్యక్రమాలతో విద్యార్థిని, విద్యార్థులు హోరెత్తించారు. ఇట్టి కార్యక్రమంలో తల్లిదండ్రులు, ప్రజలు, నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందులకు స్కూల్ డైరెక్టర్ ఎం.నవనీత సంతోష్ గుప్త లు ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలియజేశారు.



## ఉరుకుంద ఈరన్న దేవస్థానం డైరెక్టర్ గా జిలకర సావిత్రి.

- **జనసేన పార్టీ మండల నాయకులు జిలకర గణేష్**



**పెద్ద కడబూరు ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):** కౌతాళం మండలం ఉరుకుందు లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ ఈరన్న స్వామి దేవస్థానం డైరెక్టర్గా పెద్దకడబూరు మండలానికి చెందిన జిలకర సావిత్రి నియమితులయ్యారు, ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల నాయకులు జిలకర గణేష్ మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసిందని స్పష్టం చేశారు, నా తల్లి జిలకర సావిత్రి జనసేన పార్టీ తరఫున ఉరుకుంద ఈరన్న దేవస్థానం డైరెక్టర్ గా నియమితులవ్వడం చాలా సంతోషతగ్గ విషయం అన్నారు ఇందుకు జనసేన పార్టీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేల

**సంగారెడ్డి ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):** సదాశివపేట మండలంలోని తంగడపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఘనంగా మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అయిన విద్యార్థులు విద్యార్థులకు పాఠాలు బోధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని,భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తిలో వెళ్తామని తెలియజేశారు.మండల విద్యాధికారిగా కారుణ్య,ప్రధానోపాధ్యాయులు గా మణిదీప్,ఉపాధ్యాయులుగా అవంతిక,గౌరీ శ్రీ, సిందూజ,హర్షిత,కార్తీక్,మనోజ్, వ్యవహరించారు. ఈ కార్ర్యమంలో ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్,ఉపాధ్యాయులు సంతోష, పాల్గొన్నారు.



# పొలంలో విద్యుత్ షాక్.. చిన్నారి మృతి



**చేవెళ్ల ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):**

చేవెళ్ల మండల పరిధిలోని మీర్జాగూడ శివారులో ఘోర ప్రమాదం జరిగింది. అడవి పందుల నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు ఓ రైతు పొలం చుట్టూ విద్యుత్ తీగలు అమర్చాడు. అక్కడ ఆడుకుంటున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు ఆ తీగలను తాకడంతో విద్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ కళ్లముందే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# విద్యకు 20%బడ్జెట్ కేటాయించాలి

- **తల్లుల సంఘం అధ్యక్షురాలు లక్ష్మి**

**శంకర్ పల్లి ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):**

మంగళవారం శంకర్ పల్లి మున్సిపల్ లో ఎంవి ఫౌండేషన్ లో జరిగిన కార్యక్రమం నాణ్యమైన విద్య కోసం తల్లుల సంఘం ఎప్పుడు పోరాడుతుందని తల్లుల సంఘం కమిటీ అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. తెలంగాణ విద్య ఎమర్జెన్సీగా గుర్తించండి రాష్ట్ర బడ్జెట్లో విద్యకు 20 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాము. 80% విద్య సమస్యలన్నింటికీ నిధుల కొరత ప్రధాన కారణం విద్యకు కేటాయించే బడ్జెట్ విషయంలో తెలంగాణ దేశంలోనే అట్టడుగు స్థాయిలో ఉంది. గత సంవత్సరం బడ్జెట్లో విద్యకు కేటాయించింది 3% శాతం మాత్రమే సగటు సుమారు 14.5%తో పోలిస్తే తెలంగాణ కేటాయింపులు అన్ని రాష్ట్రాల కంటే తక్కువ ఉన్నత విద్యాపట్న కూడా నిర్లక్ష్యమే రాష్ట్రంలోని ఉస్మానియా కాకతీయ వంటి ప్రధాన విశ్వవిద్యాలయాలకు బడ్జెట్లో కేటాయిస్తున్న విధులు వాటి వివరణకు కూడా సరిపోవడం లేదు వెనుకంజలో తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటు భారం పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్స్ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మి, యాదమ్మ, పద్మ పజిల మంజుల, స్వప్న, సువర్ణ, లక్ష్మి, నర్మదా, దేవి, ఎంవి ఫౌండేషన్ మండల ఇన్చార్జ్ ఎస్ నాగమణి, టి మంగ, ఏం మంగ పాల్గొన్నారు.



## విద్యార్థి సంఘాల నేతలారా కర్ల రాజేష్
# ఘటనపై కోదాడకు తరలండి.

- **చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలి.**
- **కర్ల రాజేష్ ఘటనలోని నిందితులను కాపాడుతున్నది ఉత్తంకుమార్ రెడ్డినే!**
- **మందకృష్ణ మాదిగ.**

**హైదరాబాద్ ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):**

కర్ల రాజేష్ ఘటనపై "పోలీసుల అబద్ధాలు - ఎమ్మార్పీఎస్ నిజాలు" అనే అంశంతో ఉస్మానియాయూనివర్సిటీలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెమినార్ హాల్లో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిలుగా మంద కృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ల రాజేష్ మృతికి కారణం చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి అని ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని, సురేష్ రెడ్డిని సస్పెండ్ కాకుండా కాపాడుతున్నది ఉత్తంకుమార్ రెడ్డి అని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కర్ల రాజేష్ ఘటనకు సంబంధించిన పరిణామాలను ప్రతి ఆధారాలతో వివరణాత్మకంగా విద్యార్థి సంఘాల నేతలకు తెలిపిన మందకృష్ణ మాదిగ గత 98 రోజులుగా దశలవారీగా ఎమ్మార్పీఎస్ ఆధారాలను సేకరిస్తూ సమాజం ముందు ఉంచి పోలీస్ ఉన్నత అధికారులు, మానవ హక్కుల కమిషన్, ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి నిందితులైన పోలీసులకు శిక్షపడే విధంగా, రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తున్న నిరంతర ఉద్యమిస్తుందని తెలిపారు. కర్ల రాజేష్ ఘటనపై స్పందించడంలో అధికార ప్రతిపక్ష పార్టీలతో పాటు వివిధ రాజకీయ పార్టీల మరియు సంఘాలు బాధ్యత రాహిత్యంగా నిర్లక్ష్యాన్ని వహించాయని ఆవేదన వ్యక్తం చేశారు.
1.విద్యార్థి సంఘాల నేతలకు పిలుపునిస్తూ కర్ల రాజేష్ సంఘటనపై నిజనిర్ధారణకు కోదాడకు బయలుదేరండి కర్ల రాజేష్ కుటుంబంతో మాట్లాడండి అని.
2.ఉద్యమాల నేల ఉస్మానియా కేంద్రంగా అన్ని విద్యార్థి సంఘాలు కలిసి మహాధర్న నిర్వహించండని
3.అన్ని విద్యార్థి సంఘాలు కలుపుకొని హైదరాబాద్ లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం నుండి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు మహా ప్రదర్శన నిర్వహించండని అన్నారు. దేశంలో రాష్ట్రంలో ఇంకెక్కడ ఇట్లాంటి చర్యలు పునరావృతంగా కాకుండా కర్ల రాజేష్ సంఘటనలోని దోషులకు శిక్ష పడేలా పోరాడుదాం అని పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు కర్ల రాజేష్ ఘటనపై తమ తమ అభిప్రాయాలు, సూచనలు తెలుపుతూ భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి పోరాటంలో భాగస్వామ్యం అవుతామని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా.గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, పి డి ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, పి డి ఎస్ యు (జార్జిరెడ్డి) నాగేశ్వరరావు, విద్యార్థి సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.




## షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో
# మద్యం బాటిల్ ప్రత్యక్షం

- **కొబ్బరి బోండాలకు అనుమతులు లేవు కానీ కోటర్ సీసాలకు ?**
- **నిబంధనలు కేవలం బోర్డులకేనా?**
- **ప్రమాదకరంగా మారిన బయో మెడికల్ వేస్ట్**
- **ఆసుపత్రిలో పలుచోట్ల దర్శనమిస్తున్న ఇంజక్షన్లు మెడికల్ వేస్టేజ్**









**షాద్‌నగర్, ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ప్రాణదానం చేయాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి, అధికారుల నిర్లక్ష్యం వల్ల రోగాలకు నిలయంగా మారుతోంది. షాద్‌నగర్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సి హెచ్ సి) లో పారిశుధ్యం పడకేసింది. నిబంధనల పేరుతో సామాన్యులను ఇబ్బంది పెడుతున్న అధికారులు, ఆసుపత్రి లోపల జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను మాత్రం గాలికొదిలేశారు.

**నిబంధనలు కేవలం బోర్డులకేనా?**

ఆసుపత్రి లోపలికి కొబ్బరిబోండాలను తీసుకురాకూడదని పెద్ద పెద్ద బోర్డులు పెట్టిన యాజమాన్యం, అదే ఆసుపత్రి రెండో అంతస్తులో దర్శనమిస్తున్న మద్యం సీసాలను ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోగులు కోలుకోవడానికి తాగే కొబ్బరినీళ్లపై ఉన్న నియమం, మందు బాటిళ్లపై లేదా? అని పౌరులు మండిపడుతున్నారు.

**ప్రమాదకరంగా మారిన బయో మెడికల్ వేస్ట్**

ఆసుపత్రి ఆవరణలో ఎక్కడ చూసినా వాడిన ఇంజక్షన్ సూదులు, సిరంజీలు, మెడికల్ క్రీములు కుప్పలుగా పడి ఉన్నాయి. నిబంధనల ప్రకారం వీటిని సురక్షితంగా ధ్వంసం చేయాలి, కానీ ఇక్కడ మాత్రం బహిరంగంగా పడేయడం వల్ల చిన్నారులకు, రోగులకు ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం పొంచి ఉంది. స్వచ్ఛ భారత్ నినాదం ఈ ఆసుపత్రి గడప కూడా దాటలేదని ఇక్కడి పరిస్థితులు చూస్తుంటే అర్థమవుతోంది.

**బాధ్యులపై వేటు పడాల్సిందే!**

ఆసుపత్రిలో మద్యం బాటిళ్లు ఎలా వచ్చాయి? సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారు? పారిశుధ్యం నిర్వహించాల్సిన వారు నిద్రిస్తున్నారా? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలివరణలో ఎక్కడ చూసినా వాడిన ఇంజక్షన్ సూదులు, సిరంజీలు, మెడికల్ క్రీములు కుప్పలుగా పడి ఉన్నాయి. నిబంధనల ప్రకారం వీటిని సురక్షితంగా ధ్వంసం చేయాలి, కానీ ఇక్కడ మాత్రం బహిరంగంగా పడేయడం వల్ల చిన్నారులకు, రోగులకు ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం పొంచి ఉంది. స్వచ్ఛ భారత్ నినాదం ఈ ఆసుపత్రి గడప కూడా దాటలేదని ఇక్కడి పరిస్థితులు చూస్తుంటే అర్థమవుతోంది.

**బాధ్యులపై వేటు పడాల్సిందే!**

ఆసుపత్రిలో మద్యం బాటిళ్లు ఎలా వచ్చాయి? సెక్యూరిటీ సిబ్బంది ఏం ? పారిశుధ్యం నిర్వహించాల్సిన వారు నిద్రిస్తున్నారా? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

# దళితుల్ని గుళ్లోకి రాకుండా అడ్డుకున్న వ్యక్తి..!

- **కర్ణాటకలో నవ దంపతులకు గుడిలో ఘోర అవమానం**
- **దళితులు గుడిలోకి రావొద్దంటూ అడ్డుకున్న వ్యక్తి**
- **పోలీసులకు ఫిర్యాదు చేసిన నవదంపతులు**
- **గ్రామంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించిన డీఎస్పీ**

**కర్ణాటక ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):**

దేశం డిజిటల్ యుగంలో దూసుకుపోతున్నా, కొన్ని గ్రామాల్లో కుల వివక్ష ఇంకా వేళ్లూనుకునే ఉంది. కర్ణాటకలోని తుమకూరు జిల్లా తురువేకెరె తాలూకాలోని గోణి గ్రామంలో ఒక దళిత నవ దంపతులకు ఎదురైన అనుభవం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**అసలేం జరిగిందంటే..**

కొత్తగా పెళ్లయిన జగదీష్, పంకజ జంటగా దైవ దర్శనం కోసం గ్రామంలోని అరసమ్మ ఆలయానికి వెళ్లారు. వారు గుడిలోకి ప్రవేశించగానే అక్కడున్న నారాయణప్ప అనే వ్యక్తి ఒక్కసారిగా వింతగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. తనను దేవుడు ఆవహించినట్టు (శివం పూనడం) నటిస్తూ, దళిత కుటుంబం గుడిలోకి రావడానికి వీల్లేదని అడ్డుకున్నాడు. నారాయణప్ప మోకాళ్లపై కూర్చుని గర్భాలయానికి వెళ్లే దారిని అడ్డుకోవడమే కాకుండా.. ''దళితులకు ఇక్కడ ప్రవేశం లేదు, మీరు బయటకు వెళ్లండి.. కావాలంటే ఇంట్లోనే పూజలు చేసుకోండి'' అంటూ భార్యాభర్తలపై గట్టిగా అరిచాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆ సమయంలో అక్కడ ఉన్న మరికొందరు గ్రామస్థులు కూడా దంపతులకు మద్దతుగా నిలవకపోవడం గమనార్హం.

**పోలీసులకు ఫిర్యాదు..**

జగదీష్ వెంటనే తురువేకెరె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితుడు నారాయణప్పను అరెస్ట్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నారాయణప్పతో పాటు ప్రభ, కాంతన్న, అమూల్య, పుట్టెగౌడ, పద్మ అనే వ్యక్తులపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. తహసీల్దార్ మరియు డిఎస్పీ ఆధ్వర్యంలో గ్రామంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి, అంటరానితనం నేరమని గ్రామస్థులకు అవగాహన కల్పించారు.





## ఎసిబి వలలో విద్యుత్ శాఖ ఎఈ

**హైదరాబాద్ ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):**



లంచం తీసుకుంటుండగా ఎస్పిడిసిఎల్ అసిస్టెంట్ ఇంజనీర్‌ను ఎసిబి అధికారులు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మామిడిసెట్టి శ్రీనివాసరావు అసిస్టెంట్ ఇంజనీర్‌గా టిజిఎస్‌పిడిసిఎల్, మాసబ్‌ట్యాంక్ సెక్షన్‌లో ఎఈ ఆపరేషన్‌గా పనిచేస్తున్నాడు. ఓ విద్యుత్ వినియోగదారుడి మీటర్‌ను సీజ్ చేయకుండా ఉండాలంటే డబ్బులు డిమాండ్ చేశాడు. బాధితుడు ఎఈని సంప్రదించడంతో రూ.16,000లు ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నాడు. తర్వాత బాధితుడు ఎసిబి అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఎసిబి అధికారుల సూచనల మేరకు బాధితుడు ఎఈకి రూ.16,000 ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి అధికారులు నిర్వహించిన కెమికల్ పరీక్షలో పాజిటివ్ రావడంతో ఎఈని అరెస్టు చేశారు. నాంపల్లి కోర్టులో ఎఈ శ్రీనివాస రావును హాజరుపర్చడంతో ఎసిబి స్పెషల్ జడ్జి రిమాండ్ విధించారు. దీంతో ఎఈని ఎసిబి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# మూసీ తీరాన గాంధీ విగ్రహంపై వివాదం

- **రేవంత్ సర్కార్ నిర్ణయాన్ని తప్పుబట్టిన గాంధీ మునిమనవడు**
- **బాపూఘాట్ వద్ద ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయం**
- **విగ్రహాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం తగదన్న తుషార్ గాంధీ**
- **విగ్రహాల సంస్కృతి పెరిగిపోతోందని ఆవేదన**

**హైదరాబాద్ ఫిబ్రవరి 24(ప్రజాస్వరం):**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ వద్ద ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ఇప్పుడు సరికొత్త చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం భారీ వ్యయంతో 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును నిర్మించి, అక్కడ గాంధేయవాద కేంద్రాన్ని నెలకొల్పాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే, ఈ భారీ విగ్రహ ఏర్పాటుపై స్వయంగా గాంధీజీ మునిమనుమడు తుషార్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. విగ్రహాల ఏర్పాటు కంటే ప్రజల ప్రాథమిక అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ ప్రాజెక్టుపై తన నిరసనను వ్యక్తం చేస్తూ, విగ్రహాల కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని తుషార్ గాంధీ అభిప్రాయపడ్డారు. దేశంలో విగ్రహాల సంస్కృతి పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆ నిధులను విద్యా సంస్థలు, వైద్య సౌకర్యాల మెరుగుదల కోసం కేటాయిస్తే అది నిజమైన గాంధేయవాదం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. బాపూ ఆశయాలను విగ్రహాల రూపంలో కాకుండా, సామాన్య ప్రజల సంక్షేమంలో ప్రతిబింబించేలా చూడాలని ముఖ్యమంత్రికి సూచించారు. తాను వ్యక్తిగతంగా విగ్రహాల ప్రతిష్టకు వ్యతిరేకమని చెబుతూ, ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని కోరారు.
మరోవైపు, ఈ ప్రాజెక్టు కోసం లంగర్ హౌస్ పరిసరాల్లో జరుగుతున్న భూసేకరణ ప్రక్రియ స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. తమ నివాసాలను కోల్పోతామనే భయం ఒకవైపు, పర్యావరణ అనుమతులు లేకుండా పనులు మొదలుపెడుతున్నారనే విమర్శలు మరోవైపు వినిపిస్తున్నాయి. అయితే, ప్రభుత్వం మాత్రం ఇది కేవలం పర్యాటక ప్రాజెక్టు మాత్రమే కాదని, మూసీ నదిని ప్రక్షాళన చేసి హైదరాబాద్ రూపురేఖలను మార్చే ప్రక్రియలో ఇదొక కీలక భాగమని సమర్థించుకుంటోంది. గుజరాత్ సబర్మతి రివర్‌ఫ్రంట్ తరహాలో దీనిని తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేస్తోంది. ఏదిఏమైనా, గాంధీ వారసుల నుండే వ్యతిరేకత రావడం ఇప్పుడు ప్రభుత్వానికి కొంత ఇబ్బందికరంగా మారింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999